సాక్షి
వరంగల్
శనివారం । 22 । జూలై । 2023



నకిలీ మావోయిస్టుల అరెస్ట్
మావోయిస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో▸



కనువిందు చేస్తున్న జలపాతాలు
జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకున్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28.0^0/24.0^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాళోజీ సెంటర్ : జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందించాలని కోరారు.

టీఏఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రవణ్



వర్ధన్నపేట : తెలంగాణ అంబేద్కర్ సంఘం (టీఏఎస్) జిల్లా ఉపాధ్యక్షుడిగా వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఎర్ర శ్రవణ్‌కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా అందించిన తన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారని శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. తనపై మరిన్ని బాధ్యతలు పెరిగాయన్నారు. అంబేద్కర్ ఆశయసాధనం కోసం పనిచేస్తానని, హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన జన్ను నర్సయ్య, కొండేటి శ్రీనివాస్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కాజీపేట జంక్షన్‌కు డీఆర్‌ఎం రాక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు శనివారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భారతీశ్ కుమార్ జైన్ రానున్నట్లు శుక్రవారం స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ డీఆర్‌ఎంగా పని చేసిన ఏకే.గుప్తా బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఇటీవల డీఆర్‌ఎంగా భారతీశ్ కుమార్ జైన్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తొలిసారిగా కాజీపేట జంక్షన్‌లో ఆయన పర్యటించి తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు డీఆర్‌ఎం ప్రత్యేక రైలులో ఉదయం సికింద్రాబాద్ నుంచి బయల్దేరి కాజీపేటకు చేరుకుంటారు. పలు విభాగాలను తనిఖీ చేస్తారు.

'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వరంగల్ జిల్లాలోని మామునూరులోని నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు టీటీడీ నీతికథల పోటీలు

హన్మకొండ కల్చరల్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కథ చెపుతారా? ఊ కొడతాం.. నీతి కథల పోటీలను వరంగల్ పిన్నావారి వీధిలోని శ్రీశారద ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు టీటీడీ డీపీపీ జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నీతికథల పోటీల్లో పాల్గొని కథలు, కాల్పనిక కథలు కాకుండా పురాణ, ఇతిహాస, చారిత్రక అంశాలకు సంబంధించిన కథలు చెప్పాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

గీసుకొండ : మండలంలోని వంచనగిరిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. వంచనగిరికి చెందిన కోట సారయ్య(48) మృతదేహం ఉదయం ముస్లిం ఖబ్రస్తాన్ సమీపంలో రోడ్డుపై పడి ఉంది. అతడి తలకు, ఇతర శరీర భాగాల్లో బలమైన గాయాలతోపాటు కుడి కాలు ఎముక విరిగి ఉంది. గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అతడు మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి కూతురు పులిచేరు నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కారు ఢీకొని వ్యక్తి..
పర్వతగిరి: మండలంలోని గోరుగుట్టతండా దుర్గమ్మ గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కారు ఢీకొని భాస్కర్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..రఘునాథపల్లి మండలానికి చెందిన భాస్కర్ గోరుగుట్టతండాకు వచ్చి తిరిగి తురుకలసోమారం గ్రామానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వీరభద్రరావును వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. మద్యం సేవించి కారు నడుపొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

తెరిపిచ్చిన వాన

ఊపిరి పీల్చుకున్న ప్రజలు
- జిల్లాలో 62.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- జలకళ సంతరించుకున్న చెరువులు, కుంటలు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



చెన్నారావుపేట మండలంలోని మగ్దుంపురం చెరువు మత్తడిలో చేపలు పడుతున్న మత్స్యకారులు

కరీమాబాద్ : ఎడతెరిపి లేకుండా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షంతో ఇబ్బందులు పడిన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి వర్షం పడకపోవడంతో యథావిధిగా రోజువారి పనులు చేసుకున్నారు. తడిసి ముద్దయిన వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వర్ధన్నపేట పట్టణాలు, గ్రామాల్లో జనసంచారం కనిపించింది. వాగులు, వంకలు, లోలెవల్ కాజ్‌వేల్లో నీటి ప్రవాహం కొనసాగింది. కొన్నిచోట్ల చెరువులు నిండి మత్తడి పోశాయి. జిల్లాలో సగటు వర్షపాతం 62.06 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులో 19 అడుగులు, నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువులో 16 అడుగుల నీటి మట్టం చేరింది. దీంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

అధికారుల పర్యవేక్షణ..
భారీ వర్షాలతో రెడ్అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నీటివనరులు, వరదల ఉధృతి, దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్నారు. రవాణా స్తంభించడం లాంటి సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లాస్థాయి వరకు ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. అంతేకాకుండా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం తోపాటు అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
వరంగల్	69.8
ఖిలా వరంగల్	77.2
గీసుకొండ	85.0
దుగ్గొండి	99.4
నల్లబెల్లి	77.2
నర్సంపేట	94.4
ఖానాపురం	81.0
చెన్నారావుపేట	82.6
సంగెం	43.8
వర్ధన్నపేట	10.8
రాయపర్తి	16.0
పర్వతగిరి	20.6
నెక్కొండ	49.0

వ్యవసాయ పనులు ముమ్మరం..
వర్షం నిలిచిపోవడంతో శుక్రవారం వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా మారారు. ఇప్పటికే దుక్కులు దున్ని దమ్ముకొట్టిన పొలాల్లో కూలీలు వరి నాట్లు వేస్తున్నారు. మరికొందరు పొలం దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్క రోజు వర్షం తెరిపివ్వడంతో రైతులు, కూలీలతో పొలాలు సందడిగా మారాయి. జాలువారని భూములోని పత్తి, మొక్కజొన్న మొక్కలకు రైతులు ఎరువులు వేశారు. నాలుగు రోజులుగా నిలిచిన పనులు మళ్లీ మొదలయ్యాయి.

8 మండలాల్లో భారీ వర్షం..
జిల్లాలోని 8 మండలాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. 4 మండలాలలో మోస్తరుగా, ఒక మండలంలో తేలికపాటి వర్షపాతం నమోదైంది. జిల్లాలో 62.06 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.



వర్ధన్నపేట మండలం ఇల్లందలో వరినాటు వేస్తున్న కూలీలు

జలకళ సంతరించుకున్న పాకాల



పాకాలలో 19 ఫీట్ల నీటిమట్టం

ఖానాపురం : మండలంలోని పాకాల సరస్సులో శుక్రవారం సాయంత్రం నాటికి 19 ఫీట్లకు నీటిమట్టం చేరింది. పాకాల పూర్తిస్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు కాగా.. మరో 6 ఫీట్ల నీరు చేరితే ఖరీఫ్ పంటలకు సరిపోతుంది. ఎగువ ప్రాంతం నుంచి సరస్సులోకి వరద నీరు చేరుతూనే ఉంది.

'వీ హబ్' ఉద్యోగాల్లో గోల్‌మాల్!

- జిల్లా సంక్షేమశాఖ పోస్టుల భర్తీలో అవకతవకలు
- ఇప్పటికే నాలుగు ఉద్యోగాల్లో రెండు అనర్హులకు..
- తాజాగా మరో పోస్టులో విద్యార్హత పక్కనబెట్టారని చర్చ
- ఆ విభాగం ఉద్యోగులకు తెలిసిన వ్యక్తికే కట్టబెట్టారని ప్రచారం
- చైల్డ్‌లైన్‌లో అక్రమాలకు అవకాశం
- కలెక్టర్ దృష్టి సారించాలని ఉద్యోగార్థుల విజ్ఞప్తి



జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం

సాక్షి, వరంగల్ : జిల్లా సంక్షేమ శాఖలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అర్హులకు అందలం ఎక్కించారన్న విషయాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి కాంట్రాక్ట్ బేసిస్‌కు చెందిన నాలుగు ఉద్యోగాల్లో రెండు అనర్హులకు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఒకరు అంగన్‌వాడీ టీచర్ కోడలు కాగా, ఇంకొకరు జిల్లా సంక్షేమ విభాగంలో పనిచేసే అకౌంటెంట్ భార్య ఉందన్న ప్రచారమైన సంగతి తెలిసిందే. అకడమిక్ మార్కులు ఇతర ఉద్యోగార్థుల్లో కొందరికంటే తక్కువగా ఉన్నా.. అనుభవం, ఇంటర్వ్యూలో అధిక మార్కులు ఇచ్చి కావాలనే తమ వారికి అప్పగించారనే చర్చ జరుగుతోంది. ఇప్పుడు మరో నియామకం కూడా వివాదాస్పదం అవుతోంది. జిల్లా మిషన్ కోఆర్డినేటర్‌కు ఎంపికైన యువతి కూడా అదే సంక్షేమ విభాగం ఉద్యోగి బంధువు వద్ద పనిచేసిన వ్యక్తి కావడం ఇప్పుడూ చర్చకు దారి తీస్తోంది. అయితే అకడమిక్ మార్కులు ఎక్కువ ఉండడంతో పాటు అనుభవం, ఇంటర్వ్యూలో మార్కులు రావడంతో అంతా ఈ నియామకం పారదర్శకంగానే జరిగిందనుకున్నారు. ఆ పోస్టుకు సంబంధించిన విద్యార్హత లేదని, అనుభవం పెద్దగా లేకున్నా సు'కుమార'ంగా అధికారులు కట్టబెట్టారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఉద్యోగాలు.. అర్హతలు..
టెండర్ స్పెషలిస్ట్, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ ఉద్యోగాలకు సోషల్ వర్క్, ఇతర సోషల్ సైన్స్ విభాగంలో డిగ్రీ, ఎకనామిక్స్, బ్యాంకింగ్‌లో డిగ్రీతోపాటు పీజీ వారికి కూడా ప్రాధాన్యం ఇస్తామని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ పోస్టుకు మాత్రం సోషల్ సైన్స్, లైఫ్ సైన్స్, న్యూట్రిషన్, మెడిసిన్, హెల్త్ మేనేజ్‌మెంట్, సోషల్ వర్క్, రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఏదైనా డిగ్రీ పాసై ఉండాలి అని తెలిపారు. పీజీకి ప్రాధాన్యం ఇస్తామని మిగతా పోస్టుల్లాగా పేర్కొనలేదు. అర్హులను పక్కనబెట్టి, పైన పేర్కొన్న డిగ్రీలో విద్యార్హత లేని వ్యక్తికి ఈ ఉద్యోగం ఇచ్చారన్న విమర్శలున్నాయి. ములుగులో చైల్డ్‌లైన్‌లో ఓ ఎన్జీఓ తరఫున ఏడాదికి మించి పనిచేయని ఆమెకు అనుభవం మూడేళ్లు ఎలా వచ్చిందన్న ప్రశ్నలు వస్తున్నాయి. జిల్లా సంక్షేమ విభాగాధికారి కార్యాలయంలో పనిచేసే వ్యక్తి ఈ నియామకాల్లో కీలకంగా మారారని పలువురు పేర్కొంటున్నారు.

చైల్డ్‌లైన్‌లో ఇదే తీరు!
చైల్డ్‌లైన్–1098లో ప్రాజెక్టు కోఆర్డినేటర్, కౌన్సిలర్, మూడు చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ పోస్టులు, మూడు కేసు వర్కర్ పోస్టులు మొత్తం 8 పోస్టులున్నాయి. ఈ ఉద్యోగాల నియామకాల్లో కూడా అవకతవకలకు తెరలేపారన్న విమర్శలు వస్తున్నాయి. చైల్డ్‌లైన్‌లో పనిచేసే వారికి ప్రాధాన్యం కల్పిస్తూనే కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే నిబంధనను అధికారులు పట్టించుకోవడం లేదన్న టాక్ ఉంది. అర్హత, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తే బాలల సంరక్షణ చర్యల్లో జిల్లా ముందుండే అవకాశముంది. కానీ, అధికారులు అవేమి పట్టించుకోవడం లేదు. ఇప్పటికే డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కింద భర్తీ చేసిన ఉద్యోగాల మాదిరిగానే ఇక్కడ కూడా అనర్హులకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన ఉంది. కలెక్టర్ ప్రావీణ్య దృష్టి సారించి అర్హులకు న్యాయం చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

కమిటీనే మార్కులేసింది..
డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కింద భర్తీచేసిన నాలుగు ఉద్యోగాలకు 199 మంది దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలోనే ఉద్యోగాల నియామకం జరిగిందని జిల్లా సంక్షేమ విభాగాధికారి శారద తెలిపారు. తానే ఆ నియామకాలు చేపట్టలేదని ఆమె వివరించారు. అయితే, మెరిట్ లిస్టు అంతా తీసి కమిటీ ముందు ఉంచిన ఈ విభాగాధికారులే.. ఇప్పుడు జిల్లా కమిటీదే బాధ్యత అన్నట్లు మాట్లాడడం వెనుక ఆంతర్యమేమిటని ఆ శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అర్హుల విద్యార్హత సర్టిఫికెట్లు, అనుభవ పత్రాలు కావాలంటే.. ఆ అభ్యర్థులను అడిగిన తర్వాత వారు ఇవ్వమంటే ఇస్తామని శారద వివరణ ఇవ్వడం గమనార్హం. నియామకాలు పారదర్శకంగా జరిగితే.. వారికి సంబంధించిన పత్రాలు బయటపడితే తప్పేముందని ఆ శాఖలోనే చర్చ జరుగుతోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, పోలీస్, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి, ప్రజలు వ్యాధులబారిన పడకుండా చూడాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని, వ్యాధులు ప్రబలితే వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రిని సందర్శించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు తలెత్తితే తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎర్రబెల్లి స్వర్ణను కలిసిన కేఆర్.నాగరాజు



ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు దంపతులను సన్మానిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ కేఆర్.నాగరాజు

హన్మకొండ: కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఆమె స్వగృహంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు దంపతులను సన్మానించారు.

జెడ్పీ ఫ్లోర్ లీడర్‌పై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్లు

నెక్కొండ : అధికారిక కార్యక్రమాల్లో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ, ప్రొటోకాల్‌ను పాటించని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పీఏసీఎస్ డైరెక్టర్లు రావుల హరీష్‌రెడ్డి, తాటిపర్తి నాగేంద్రమ్మ, రెడ్డబోయిన కుమారస్వామి కోరారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీఏసీఎస్ పరిధిలోని నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆమె ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పీఏసీఎస్ డైరెక్టర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చైర్మన్ మారం రాము, సీఈఓ మోడెం సురేష్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కొనుగోళ్లల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో ప్రతీ క్వింటాలుకు 10 కిలోల కోత పెట్టి రైతులను మోసం చేశారన్నారు. ప్రొటోకాల్ విస్మరించడం, పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై కలెక్టర్‌కు, డీసీఓకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రెడ్లవాడ ఎంపీటీసీ మాలోతు రవి, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు భిక్షపతి, బండి శివకుమార్, సింగం ప్రశాంత్, ఈదునూరి సాయికృష్ణ, రావుల మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం ఆలోచనలకు ప్రతిరూపం కళాక్షేత్రం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, 'కుడా' చైర్మన్

హన్మకొండ అర్బన్: సీఎం ఆలోచనలకు ప్రతిరూపమే కాళోజీ కళాక్షేత్రం అని 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కళాక్షేత్రం నిర్మాణ పనులపై కుడా చైర్మన్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సుందర్ రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాక్షేత్రం సత్వరమే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. కాళోజీ రచనలు, చరిత్ర, పరిశోధనలు వంటివి సంపూర్ణంగా గ్యాలరీలో ఉంచాలన్నారు. సమావేశంలో 'కుడా' అధికారి అజిత్‌రెడ్డి, కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ రామశాస్త్రి, ప్రధాన కార్యదర్శి విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : వరంగల్‌లోని సీకేఎం కళాశాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో పరిపాలనా పరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందేనని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గవర్నింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షురాలు, కలెక్టర్ ప్రావీణ్య కళాశాలలో విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల పరిస్థితి, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌ల సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. సమావేశంలో కళాశాల పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు, ట్రెజరర్ ఈరసాని వెంకటరెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ఎస్ఎస్‌వీఎస్ శర్మ, కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజారెడ్డి, చందా శ్రీకాంత్, డాక్టర్ వి.ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎస్ శర్మను సీకేఎం కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీయులు



గంగదేవిపల్లిని సందర్శించిన ప్రతినిధులతో జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఇథియోపియాతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఇథియోపియా దేశం నుంచి యోహువాలా, పాండిచ్చేరి నుంచి శాంతివేలు, ప్రవీణ్, జార్ఖండ్ నుంచి దిలీప్‌కుజూర్, ఏపీ నుంచి భవాని రామ తులసి, తెలంగాణ రాష్ట్రం నుంచి సతీష్, సుప్రత, బాలవికాస నుంచి కొట్టె రమాదేవి, సుప్రియ గ్రామ సందర్శనకు వచ్చారు. బాలవికాస పీపుల్స్ డెవలప్‌మెంట్ ట్రెయినింగ్ సెంటర్‌లో రెండు వారాలపాటు శిక్షణ పొంది ఫీల్డ్ స్టడీలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. గ్రామ కమిటీల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో సాధించిన విజయాల గురించి జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు.

స్త్రీనిధి రుణాలతో సోలార్ విద్యుత్



పొదుపు సంఘాల మహిళల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బాలిరెడ్డి

- ముందుకు వచ్చేవారికి రూ.20 వేల ఆర్థిక సాయం
- మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి

గీసుకొండ : స్త్రీనిధి రుణాలతో పొదుపు సంఘాల మహిళలు సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసుకోవచ్చని, ఇందుకోసం ముందుకు వచ్చే మహిళలకు తాను సొంతంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తానని మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ప్రకటించారు. సోలార్ విద్యుత్‌పై పొదుపు సంఘాల మహిళలతో శుక్రవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.29 వేల సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. మిగిలిన రుణ మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించాని వివరించారు. ఒక కిలోవాట్, రెండు కిలోవాట్ల సోలార్ విద్యుత్ పరికరాలకు తాను రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తానని చెప్పారు. ఈ విషయమై త్వరలో గ్రామంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కలిగిస్తామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, వీఓఏ బొట్ల జ్యోతి, లలిత, టీం లీడర్లు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు శాపంగా సీపీఎస్




సంకల్ప రథయాత్రలో పాల్గొన్న సీపీఎస్ ఈయూ బాధ్యులు

నర్సంపేట : ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట సీపీఎస్ శాపంగా మారిందని టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ అన్నారు. ఈ మేరకు టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర శుక్రవారం నర్సంపేటకు చేరుకుంది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రారంభించిన రథయాత్ర ఈనెల 31న యాదాద్రిలో ముగుస్తుందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల తర్వాత తెలంగాణలో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసిన మొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిలవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి పీఎఫ్ ఆర్‌డీఏకి చేరిన 9 లక్షల కోట్ల రూపాయలను వెంటనే ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలని కోరారు. ఇందుకోసం అక్టోబర్ 1న 20 లక్షల మంది ఉద్యోగులతో రాంలీల మైదానంలో భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవిచంద్ర, రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్‌నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె) : ముత్యంధార జలపాతం



గంగారం : ఏడుబావుల లొద్ది జలపాతం



వాజేడు : బొగత జలపాతం



బయ్యారం : జాలువారుతున్న పాండవుల జలపాతం, వెంకటాపురం (కె): మహితాపురం జలపాతం





ఫొటో స్టోరీ

కనువిందు చేస్తున్న జలపాతాలు

భారీ వర్షాలతో వస్తున్న వరదలతో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని జలపాతాలు పర్యాటకులను కనివిందు చేస్తున్నాయి. బయ్యారం మండలంలోని వంకమదుగువాగుపై ఉన్న చింతోనిజలపాతం, బయ్యారం గుట్టపై ఉన్న పాండవుల జలపాతం పై నుంచి లోతైన ప్రాంతంలో జాలువారుతున్న నీటి అందాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన భీమునిపాద జలపాతం పర్యాటక కేంద్రంగా పేరు గాంచింది. గంగారం మండలంలోని కొడిశలమిట్ట అటవీ ప్రాంతంలోని ఏడుబావుల లొద్ది పర్యాటకులను వర్షాకాలం ఆకర్షిస్తోంది. ఏడు బావుల లొద్ది నుంచి జలపాతం గలగలపారుతూ నేలను తాకుతుండడంతో... చుట్టూ పచ్చదనంతో అడవి... కోకిల రాగాలతో కనువిందు చేసేలా ఏడుబావుల లొద్ది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం, వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతం, మహితాపురం జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. జలపాతాల అందాలను చూసేందుకు మండల వాసులతో పాటు ఖమ్మం, ఇల్లందు, గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, గూడూరు, నర్సంపేట హైదరాబాద్ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు.

- బయ్యారం/గూడూరు/గంగారం/వెంకటాపురం(కె)/వాజేడు



గూడూరు: భీమునిపాద జలపాతం



బయ్యారం: బొల్లిజలపాతం

పోక్సో కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

మరిపెడ: పోక్సో కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు సివిల్ జడ్జి చంద్రశేఖర ప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం శివారు బాల్యతండాకు చెందిన బాలిక మరిపెడలోని సోషల్ వెల్ఫేర్‌లో 5వ తరగతి చదువుతుంది. ఈ నేపథ్యంలో పడమటిగూడెం తండాకు చెందిన పవన్‌కుమార్ బాలికను వసతిగృహం నుంచి పేరెంట్ అని చెప్పి ఆగస్టు 22, 2022లో వెంట తీసుకెళ్లి మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారులో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం తొర్రూర్ సివిల్ కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 9 వేలు జరిమానా విధించినట్లు పీపీ పద్మాకర్‌రెడ్డి చెప్పారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా విద్యాసంస్థలకు సెలవు ఉంటుంది. ఈ మేరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారని హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హై తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈనెల 20, 21న కూడా సెలవులు ఇచ్చిన విషయం విధితమే. 23 ఆదివారం 24న విద్యాసంస్థలు తెరుచుకుంటాయి.

ఆమడ దూరంలో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు



వరంగల్ కేఎంసీ మెటర్నిటీ ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం



మాట్లాడుతున్న ఐసీటీసీ కేంద్రం నిర్వాహకులు

- కీలకమైన వరంగల్ కేఎంసీ సెంటర్ ఎత్తివేత..?

సాక్షిప్రతినిధి, వరంగల్: హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పేరుతో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ) కేంద్రాలను కుదించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో) ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ మేరకు జూలై 5న న్యాకో జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 11025 పట్ల ఆ సంస్థ సిబ్బంది ఆందోళనలో పడ్డారు. ఎయిడ్స్ రోగులు సైతం అయోమయానికి గురవుతున్నారు.

ఐసీటీసీ కేంద్రాన్ని ఎత్తేయడం సమంజసం కాదు

ఎంజీఎం :పేద గర్భిణీలకు ఉత్తమ సేవలందిస్తున్న వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఐసీటీసీ కేంద్రం ఎత్తివేయడం సమంజసం కాదని ఐసీటీసీ కేంద్ర నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా ప్రప్రథమంగా 2002 నాకో సీకేఎం ఆస్పత్రిలో ఎస్‌పీసీఎస్ ఆధ్వర్యంలో ఐసీటీసీ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ కేంద్రం ద్వారా ఆస్పత్రిలో 3 వేల పరీక్షలు చేయడంతో పాటు 8 హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న ప్రసవాలు చేసి తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సోకకుండా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. గత 21 ఏళ్లుగా వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో చికిత్సలు అందించినట్లు తెలిపారు. కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి 3,52,766 పరీక్షలు నిర్వహించి 1347 పాజిటివ్‌లు రాగా ఇందులో 1089 డెలివరీలు చేసినట్లు తెలిపారు. అలాగే పిల్లలకు 18 నెలల వరకు ఫాలో ఆప్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారని, రాష్ట్రంలో రెండుసార్లు ఉత్తమ అవార్డులు తీసుకున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఎత్తివేసే కేంద్రాలు ఇవే ...

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్ (కేఎంసీ) ఆవరణలోని ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సెలింగ్ (ఐసీటీసీ), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గల రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని రెండు ఐసీటీసీ కేంద్రాలు మహాదేవపూర్, చిట్యాల. మహబూబాబాద్ జిల్లాలో గూడూరు, వరంగల్ జిల్లాలో సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్‌లలో గల ఐసీటీసీ కేంద్రాల ఎత్తివేతకు రంగం సిద్ధం కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు కేఎంసీలో 'రీసెర్చ్' డే

- హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు



బుక్ ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ అసోసియేషన్ బాధ్యులు

ఎంజీఎం: మెడిసిన్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు శనివారం కేఎంసీలోని ఎన్ఆర్ఐ బిల్డింగ్‌లో విద్యార్థులకు 'రీసెర్చ్ డే' నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుజిత్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెడిసిన్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గిందని గ్రహించి, వాటిని పెంపొందించేందుకు ఈ రీసెర్చ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు సుజిత్ పేర్కొన్నారు. మొదటి దశలో ఇక్కడ నిర్వహించిన ఫలితాలను బట్టి దీన్ని మొత్తం భారతదేశం మొత్తం అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి కావాల్సిన వనరులను మొత్తం ఎన్ఆర్ఐ అసోసియేషన్ భరిస్తుందని తెలిపారు. రీసెర్చ్ డేలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మెడిసిన్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం రీసెర్చ్ డేకు సంబంధించిన పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ అనుపమ, వైస్ ప్రెసిడెంట్‌లు డాక్టర్ వేణు, డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్‌రావు, డాక్టర్ వి.లక్ష్మి నరసింహారావు, డాక్టర్ మోహన్‌దాస్, రోహిత్, సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ మావోయిస్టుల అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వెంకటాపురం(కె): మావోయిస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు నకిలీ మావోయిస్టులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మావోయిస్టు ఏరియా కార్యదర్శి సుధాకర్ పేరుతో ఇసుక కాంట్రాక్టర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తిరుపతిరావు, సిబ్బందితో కలిసి వెంకటాపురం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించి పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ముగ్గురిని విచారించగా మంగవాయి గ్రామానికి చెందిన తాటి సురేష్, మంగులు చత్తీష్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా జారువ గ్రామం, గోట రాజస్తాన్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కాండే గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

ఐ ఫోన్ గెలుచుకున్నావు..

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువకుడు
- బ్యాంకు ఖాతాలో రూ.29 వేలు మాయం

ఖిలా వరంగల్: ఐ ఫోన్ గెలుచుకున్నావంటూ మొబైల్‌కు మెసేజ్..కాల్ రాగా దీనిపై ఓ యువకుడు స్పందించి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి రూ.29వేలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం ఖిలావరంగల్‌లో వెలుగుచూసింది. బాధితుడి కథనం ప్రకారం మధ్యకోటకు చెందిన హైమద్ అలీ మొబైల్‌కు శుక్రవారం సైబర్‌నేరగాడు 7837905596 నంబర్‌ను నుంచి మేసేజ్.. ఆ తర్వాత కాల్ వచ్చింది. తనయుడి చేతిలో ఉన్న తండ్రి మొబైల్‌కు వచ్చిన మేసేజ్‌పై వెంటనే యువకుడు స్పందించాడు. మీకు ఐ పాడ్ మొబైల్ గెలుచుకున్నావంటూ మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని సైబర్ నేరగాడు కాల్ చేసి అడిగాడు. ఆ యువకుడు ఆనందంతో ఓటీపీ చెప్పాడు. క్షణాల్లోనే తండ్రి బ్యాంకు ఖాతా నుంచి రూ.29 వేల నగదు మాయమైనట్లు మెసేజ్ వచ్చింది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కానని బ్యాంకు ఖాతాను బ్లాక్ చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు హైమద్ అలీ తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



ఓ సిటీ మైదానంలో స్థితప్రజ్ఞకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

కాశిబుగ్గ : సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం ఆగదని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి చేపట్టిన సంకల్ప రథయాత్ర శుక్రవారం సాయంత్రం వరంగల్‌కు చేరుకుంది. ఓ సిటీ మైదానం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2004 నుంచి ఆమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాన్నారు. పాత పెన్షన్ విధానం సాధించడమే ఈ సంకల్ప రథయాత్ర లక్ష్యమన్నారు. అనంతరం ఉద్యోగులు రథయాత్రతో పాటు బైక్ యాత్ర వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగు రోడ్డు మీదుగా హనుమకొండ కీర్తిస్తూపం వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ యాత్రలో జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్, వివిద శాఖల సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



భూక్య రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని దర్గతండ గ్రామపంచాయతీ పరిధిలోని టేకులగూడెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులగూడెంకు చెందిన రైతు భూక్య రమేష్ (35) తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లాడు. బావికి సంబంధించిన స్టార్టర్ బోర్డు పాకాల వాగు వరద ఉధృతి పెరగడంతో అందులో పడి తడిసిపోతుందని ఆందోళనతో అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానిక రైతులు గమనించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వలలో చిక్కి మత్స్యకారుడు..



నాగయ్య మృతదేహం

దేవరుప్పుల : నాలుగు దశాబ్దాలుగా కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారుడు ఆసరా ఇచ్చిన చేపల వలలోనే చిక్కి మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం మాదాపురంలో చోటుచేసుకుంది. మండలంలోని మాదాపురంలో ముదిరాజ్ కులానికి చెందిన బొందుగుల నాగయ్య (55) గ్రామసమీపంలోని గరికచెరువు మత్తడి పోయడంతో చేపలు పట్టేందుకు వలతో వెళ్లాడు. చేపల కోసం వల విసిరిన అతను తీసేందుకు యత్నించే క్రమంలో ఈత వచ్చినప్పటికీ వలలో చిక్కుకొని లోతుగా ఉన్న నీళ్లలో పడి నీటమునిగాడు. సమీపంలో పశువులను కాస్తున్న నాగయ్య మేనల్లుడు శివతేజ గమనించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం అందించారు. నీటమునిగిన నాగయ్యను బయట తీసి పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. సంఘటనస్థలానికి హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్.శ్రీనివాస్ చేరుకొని భార్య ఉప్పమ్మ ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

28 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

కాజీపేట: ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. శుక్రవారం రాత్రి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ సార్ల రాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సై బండారి రాజు పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులను అనుమానాస్పదంగా నాలుగు బ్యాగులతో కనిపించగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ బ్యాగుల్లో 28 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించిందన్నారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన ఫిరోజ్ అహ్మద్ పటేల్, షేక్ షఫీక్, షేక్ గయాస్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి విలువ దాదాపు రూ.5.60 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సైలు బండి రాజు, ప్రమోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో ఈనెల 22న నిర్వహించాల్సిన పలు పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. బీ ఫార్మసీ 8వ సెమిస్టర్, ఫార్మాడి నాల్గవ సెమిస్టర్, బీటెక్ ఫస్టియర్ అలాగే బీఫార్మసీ నాన్ సీబీసీఎస్ నాల్గవ, మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు కూడా వాయిదా పడిన విషయం విదితమే. వాయిదా పడిన పరీక్షల రీషెడ్యూల్‌ను శనివారం విడుదల చేస్తామని వారు తెలిపారు.

పెండింగ్ కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ

వరంగల్ లీగల్: చాలా కాలంగా విచారణలో ఉన్న పలు కేసుల్లో వరంగల్ రీజనల్ సీఐడీ పోలీసులు శుక్రవారం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2010 ఖమ్మం జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన లజ్జ కేసుగా పేరు గాంచిన ఈ కేసును మతవైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా..దురుద్దేశ పూరిత వ్యాఖ్యలతో కూడిన రెండు వ్యాల్యూమ్స్‌తో కూడిన బుక్స్ ముద్రించిన నేరంపై ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. మహ్మద్ ప్రవక్త, ముస్లిం పవిత్ర గ్రంథమైన ఖురాన్‌పై వివాదపరమైన వ్యాఖ్యలు రాసిన దానిపై నిషేధిత సల్మాన్ ఖుర్షిద్ రాసిన సటానిక్ వర్సెస్, తస్లీమా నస్రీన్ రాసిన లజ్జ పుస్తకం ..నిషేధించిన పుస్తకాల నుంచి రాసిన కథనాలపై కేసు నమోదు చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మన్నపేట పోలీస్‌స్టేషన్‌లో 2016లో నమోదైన కేసులో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి శ్రీలంకలోని కొలంబోకు తీసుకెళ్లి రూ.5 లక్షలకు కిడ్నీ మార్పిడి చేశారు. అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ కేసులో శ్రీలంకతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ పరీక్షల్లో మోసపూరితంగా కుట్ర చేసి ఓ వ్యక్తి బదులు మరో వ్యక్తితో పరీక్ష రాయించిన కుట్రలో సుంచుపెల్లి పోలీస్‌స్టేషన్‌లో 9 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే స్టేట్‌బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ కేసముద్రం బ్రాంచిలో ముద్ర లోన్‌గా పేరుగాంచిన కేసులో 9 మంది నిందితులపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ లబ్ధిదారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించి సంతకాలు ఫోర్జరీ చేసి ఒక్కొక్కరిపై రూ.6 లక్షలు మొత్తం రూ.54 లక్షలు లోన్ మంజూరు చేశారు. దీనిపై ఇరువురు బ్యాంకు అధికారులు, తొమ్మిది మంది లబ్ధిదారులపై కేసు నమోదు చేశారు. ఆయా కేసుల్లో విచారణ చేపట్టి శుక్రవారం వరంగల్ సీఐడీ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

2012 బ్యాచ్ ఎస్సైలకు పదోన్నతి

వరంగల్ క్రైం: రాష్ట్రంలో 2012 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురికి పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో భూక్య శంకర్, కొత్తపల్లి అశోక్ కుమార్, పెండ్యాల దేవేందర్, సీహెచ్.కరుణాకర్‌రావు (ములుగు), నందునూరి చంద్రమోహన్ ఉన్నారు. పదోన్నతి పొందిన అధికారులను పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.